# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ డిజిటల్ ఆర్థిక నేరాల నియంత్రణ దిశగా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.
- ❖ రాష్ట్రంలో ఆతిధ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- ❖ పర్యాటక రంగం అభివృద్ధితో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.
- ❖ ఈ ఏడాదిలోనే పోలవరం ద్వారా విశాఖకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు.

======================

డిజిటల్ ఆర్థిక నేరాల నియంత్రణ దిశగా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. డిజిటల్ అరెస్టులు, ఇతర సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఓ ప్రత్యేక ఎస్వోపీని రూపొందించాలని బ్యాంకర్లకు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో 235వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి ముఖ్యమంత్రి ఈరోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈలకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేసి ప్రోత్సహించాలన్నారు. ఆక్వా రంగానికి కూడా బ్యాంకులు ప్రోత్సాహకం ఇవ్వాలని సూచించారు.

======================

రాష్ట్రంలో ఆతిధ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ రంగం మీద పలు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని ఆయన చెప్పారు. ఐటిసి చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ సంజీవ్ పూరితో కోల్ కతాలో మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్

మాట్లాడుతూ... శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో సుమారు 220 జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకొని.. ఇప్పటికే పనులు ప్రారంభించాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలసి క్రాప్ వాల్యూ చైన్ క్లస్టర్లలో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని కోరుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఇదిలా ఉండగా ఐటిసి ఛైర్మన్ సంజీవ్ పూరి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

======================

పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖకు తాగునీరు ఈ ఏడాదిలోనే అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని విశాఖ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. కూటమి పాలనకు రెండేళ్ళు పూర్తి అయిన సందర్భంగా స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విశాఖకు ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలను తీసుకువస్తున్నామని చెప్పారు. గత రెండేళ్లలో విశాఖలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని గుర్తు చేశారు. గూగుల్ మెగా డేటా సెంటర్ వంటి భారీ పెట్టుబడులు విశాఖకు రావడం గర్వకారణమని చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని మంత్రి తెలిపారు. అదే విధంగా రైల్వే జోన్ సాధన రాష్ట్రానికి మరో ప్రధాన విజయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఎంపీ శ్రీ భరత్, పలువురు ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

======================

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా పర్యాటక రంగం మారుతోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పర్యాటక శాఖ దీని ద్వారా భారీ ఎత్తున ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విజయవాడలో పాత్రికేయులతో మంత్రి ఈరోజు మాట్లాడుతూ... పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో పాటు.. 20 వేల కోట్ల రూపాయల భారీ పెట్టుబడుల ఆకర్షిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అమలైతే లక్షా 22 వేల 637 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 4 వేల 390 హోటల్ గదులకు అదనంగా మరో 9 వేల 042 గదులు అందుబాటులోకి వచ్చేలా 50 కొత్త హోటళ్లకు అనుమతులు ఇచ్చామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

======================

రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ భవనం అరణ్యారామానికి ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు శంకుస్థాపన చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో బ్రహ్మానందపురం వద్ద సుమారు 24 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. 'అరణ్యారామం..' అటవీ, పర్యావరణ శాఖలకు సంబంధించి పరిశోధనలు, శిక్షణా కార్యకలాపాలతో పాటు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలన్నింటినీ కామన్ ఫెసిలిటీ సెంటర్ గా సేవలు అందించనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

======================

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని ఎస్.కె.బి.ఎం. పాఠాశాలలో

ఐటిసి సహకారంతో ఎం.పి. ల్యాడ్స్ నిధులతో కలిపి నిర్మించిన భోజనశాల, నూతన తరగతి గదులను ఆయన ఈరోజు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మారుస్తున్నామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

======================

సముద్ర తీర ప్రాంతాలకు వచ్చే పర్యాటకుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు విశాఖపట్నం రేంజ్ కోస్టల్ మెరైన్ IG జె. గోపినాథ్ చెప్పారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు సముద్ర తీరంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెరైన్ ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ను స్థానిక ఎమ్మెల్యే కొండయ్య, జిల్లా SP ఉమామహేశ్వర్ తో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం తదితర ప్రాంతాలకు రాష్ట్రం నలుమూలాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివస్తున్న క్రమంలో పర్యాటకుల భద్రతా ప్రమాణాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఈక్రమంలోనే ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్లు, సీసీ కెమెరాలు, డ్రోన్స్ వంటి అనేక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

======================

అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం కింద 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలివిడత సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రేపు విడుదల చేయనుంది. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 46 లక్షల 85 వేల 838 రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం 5 వేల రూపాయలు, పీఎం కిసాన్ కింద కేంద్రం 2 వేల రూపాయలు కలిపి ఒక్కో రైతు ఖాతాలో 7 వేల రూపాయలు జమ చేయనున్నారు.

======================

తూర్పు విదర్భ నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా తమిళనాడు వరకు విస్తరించి ఉన్న నిన్నటి అల్పపీడన ద్రోణి సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా జిల్లాలతో పాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మి పేర్కొన్నారు.

======================
======================